క్లుప్తంగా

ఎన్‌ఆర్‌హెచ్‌సీ మండల కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా చైర్మన్ రమేశ్

లింగాపూర్: మానవ హక్కుల కమిటీ మండల కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు ఎన్‌ఆర్‌హెచ్‌సీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ అన్నారు. మండల చైర్మన్‌గా జాదవ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆడే అశ్విన్, వైస్‌చైర్మన్‌గా జాదవ్ వినోద్, కన్వీనర్‌గా హిరన్‌కుమార్, ఈసీ సభ్యుడిగా అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికి 'ఆశ'ల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

దహెగాం: ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఆశ కార్యకర్తల మండల సంఘం అధ్యక్షురాలు నాగుల శోభ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రత, రూ.18 వేల వేతనం, జీవిత బీమా, ఏఎన్‌ఎం ట్రైనింగ్ పొందిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలన్నారు. ఆశ కార్యకర్తలు విజయలక్ష్మి, భాగ్య, సంగీత, రజిత, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు సేవ చేయడం వరం'

ఆసిఫాబాద్‌రూరల్: ఆపదలో ఉన్న నిరుపేదలకు సేవ చేయడం వరమని వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని యాపల్‌పట్టి గ్రామంలోని ఆదివాసీ గిరిజనులకు దుస్తులు, పిల్లలకు నోట్‌బుక్, పెన్నులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మారుముల ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా సభ్యులు కిశోర్, వెంకటేశ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ ప్రారంభోత్సవానికి సన్నద్ధం

తిర్యాణి: నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్‌స్టేషన్ భవనంలో గ్రంథాలయం నిర్వహణను చేపట్టేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మంగళవారం పాత పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్సై మాట్లాడుతూ పోలీసుస్టేషన్ భవనంలో త్వరలోనే గ్రంథాలయం నిర్వహణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తిర్యాణి: ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం మండలంలోని కన్నెపెల్లి, గోయెగాం గ్రామాల్లో కళాజాత బృందం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకు మేనేజర్ రవి కిరణ్ మాట్లాడుతూ రైతులకు అనేక విధాల రుణాలను సహకార బ్యాంకు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని తిరిగి సక్రమంగా చెల్లించాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'జమిలీ ఎన్నికలే లక్ష్యం'

ఆసిఫాబాద్: ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదంపై బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలంతో కలిసి 16 మండలాల వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్లు, కో కన్వీనర్లతో జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా ఆర్థికభారం తగ్గుతుందన్నారు. పార్లమెంటులో మెజార్టీ లేకపోవడంతో గతంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు ముందుకు వెళ్లలేదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సేర్ల మురళి, సీనియర్ నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, రాజేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా విజయోత్సవాలు నిర్వహించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీలో ఎస్సీల వర్గీకరణ బిల్లుకు తెలంగాణ ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిరసన దీక్షా శిబిరాల వద్ద విజయోత్సవాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేయాలన్నారు.

మద్యం మత్తు.. ప్రాణం చిత్తు!





రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల మండలం గురుదుపేట గ్రామానికి చెందిన తలండి రవి(27) ఈ నెల 13న మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. రవి గత కొంత కాలంగా తాగుడుకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో తాగిన మైకంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆయన భార్య భారతి, ముగ్గురు పిల్లలు కుటుంబపెద్దను కోల్పోయారు. ఇలా.. రవి కుటుంబం మాదిరి అనేక కుటుంబాలు మద్యం ప్రభావంతో చిత్తవుతున్నాయి.

- బానిసవుతున్న యువత
- మద్యం మత్తులో బలవన్మరణాలు
- కుటుంబాలు ఛిన్నాభిన్నం
- వారంలో ముగ్గురు మృతి
- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు



కౌటాల వైన్స్ నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలింపు (ఫైల్)

కౌటాల: ఈరోజుల్లో మద్యం తాగే అలవాటు లేనివారు చాలా అరుదు. కానీ కొందరు తాగడం కోసమే పుట్టినట్లు నిత్యం మద్యం మత్తులో తూలుతూ వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారు. చెడు స్నేహాలకు అలవాటు పడి మద్యానికి బానిసలవుతూ యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మద్యం మత్తులో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ కొందరు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొందరు తాగుడుకు అలవాటు పడి అనారోగ్యంతో ఆసుపత్రులపాలై చివరికి అసువులు బాపుతున్నారు.

సంసారాల్లో చిచ్చు..

విచ్చలవిడిగా లభిస్తున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చురేపుతోంది. నిత్యం తాగి వచ్చి మందుబాబులు విచక్షణ కోల్పోయి భార్య, పిల్లలను ఇష్టారీతిగా కొడుతున్నారు. మత్తులో బైక్‌లు నడుపుతూ, యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మద్యానికి అలవాటు పడి కొందరు తమ జీవితాలు కోల్పోతున్నారు. మద్యానికి బానిసై అనారోగ్యం పాలై కొందరు, జీవితంపై విరక్తి చెంది కొందరు ఆయువు వదులుతున్నారు. దీంతో వారి కుటుంబాలు ఆగమైపోతున్నాయి. మద్యానికి బానిసైన పిల్లలు, భర్తలను ఎలా మాన్పించాలో తెలియక మహిళలు కన్నీరు పెడుతున్నారు. జిల్లాలో గత వారం రోజుల్లో మద్యానికి బానిసై ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

కిరాణా షాపుల్లోనూ లభ్యం..

జిల్లాలో 32 మద్యం దుకాణాలు 3బార్లు ఉన్నాయి. ఏటా రూ.200కోట్ల పైచిలుకు సరుకు అమ్ముడవుతోంది. మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా వాటి సంఖ్య 1200లకు పైగా ఉంది. సమీప వైన్స్‌లలో కొనుగోలు చేసిన మద్యాన్ని అధిక ధరలకు బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు కౌటాల, వాంకిడి, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పల్లెల్లో, పట్టణాల్లో కొన్ని కిరాణా దుకాణాలు మద్యం అమ్మకాలకు అడ్డాగా మారాయి. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, ఇతర మండల కేంద్రాల్లో ఇళ్ల నివాసాల మధ్య, పాఠశాలల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ అమ్మకాల్లో లక్ష్యం చేరుకోవడానికి వైన్స్‌ల యజమానులే గొలుసు(బెల్ట్‌షాప్స్) దందాను ప్రోత్సహిస్తున్నారు. ముడుపులు ముట్టడంతో సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయాలని పోలీసులు, అబ్కారీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు, పోలీసులు గ్రామాల్లో మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవలి ఘటనలు..

- కౌటాల మండలం మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన ఉర్వత్ దౌలత్(26) మద్యానికి బానిసై బావిలో పడి ఈ నెల 11న మృతి చెందాడు. దౌలత్ గత కొన్నేళ్లుగా మద్యం తాగుతూ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు.
- బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన కావుడే లస్మయ్య(52) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 13న మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

అతి మద్యంతో అనారోగ్యం



అతిగా మద్యం తాగితే అనారోగ్యం బారిన పడతారు. ఆల్కహాల్ గుండె కండరాలను బలహీన పరుస్తుంది. మద్యానికి బానిసైన వ్యక్తి శరీరంలోని ఊపిరితిత్తులు, కాలేయం, మెదడు దెబ్బతింటాయి. మద్యం మత్తులో ఉన్న వారికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వస్తాయి. మద్యానికి బానిసైన వారు మానసిక అనారోగ్యానికి గురవుతారు. మద్యానికి బానిసైన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డా. నవత, మెడికల్ ఆఫీసర్, కౌటాల

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్‌బాబు, హెచ్‌ఎం విజయ నిర్మల, ఏఏపీసీ చైర్మన్ స్వప్న, పీజీ హెచ్‌ఎం ప్రసాద్, కేజీబీవీ ఎస్‌వో కవిత, ఉపాధ్యాయులు యాదగిరి, మాజీ ఎంపీటీసీ రాజన్న, నాయకులు రాజన్న, శంకర్ గౌడ్, కృష్ణ, వెంకన్న, భాస్కర్, శంకర్, నగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న శ్యాంరావు

దహెగాం: మండలంలోని గెర్రె గ్రామంలో బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో స్ఫూర్తి ప్రోత్సహించడానికి క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో శరీర ధారుడ్యం పెరగడంతో పాటు స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. క్రీడాకారులు సంయనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దండెర మల్లేశ్, శివార్ల సంపత్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు



మాట్లాడుతున్న ఏవో

దహెగాం: మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తామని మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మహిళా రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, రోటోవేటర్, కల్టివేటర్, బ్రష్ కట్టర్, ట్రాక్టర్ తదితర యాంత్రిక పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కావాల్సిన వారు భూసార పత్రం, మహిళా పట్టా పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్మశానవాటికలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెత్తను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'అప్పుల పంచాయతీ' కథనంలో మండల కేంద్రంలోని సదాశివపేటలో డంపింగ్ యార్డును తలపిస్తున్న శ్మశాన వాటిక ఫోటోకు ఎంపీడీవో కోట ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ స్పందించారు. మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో డంపింగ్ చేసిన చెత్తచెదారంను ట్రాక్టర్‌తో తొలగించారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు..!

- నిరుపయోగంగా పశువుల నీటి తొట్టీలు
- దాహార్తి తీరక మూగజీవాలకు తిప్పలు
- మురుగుకాలువలో నీరు తాగుతున్న వైనం
- తొట్టీల్లో నీటిని నింపాలని రైతుల వేడుకోలు



శిథిలావస్థకు చేరిన పశువుల నీటితొట్టీ

లింగాపూర్: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలతో పాటు చెరువులు, కాలువల్లో నీరు అడుగంటిపోతోంది. ఈక్రమంలో మూగజీవాలు ఎండాకాలంలో దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం మూగజీవాలు, పక్షుల దాహార్తి తీర్చేందుకు గతంలో ఉపాధిహామీ పథకం కింద నీటి తొట్టీలను నిర్మించింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో, కాలనీల్లో నీటిసౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ కులాయిల వద్ద నిర్మించారు. కానీ నిర్లక్ష్యానికి గురై నిరుపయోగంగా మారాయి.

సమన్వయ లోపం.. జీవాలకు శాపం..

పశువులకు నీటి సౌకర్యం కల్పించడానికి ఏర్పాటు చేసిన నీటి తొట్టీలను వినియోగంలోకి తెచ్చేందుకు పశుసంవర్ధక శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పరిస్థితి ఉంది. తొట్టీలకు నీటిని సరఫరా చేసే విషయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం చర్యలు తీసుకోవాలి. ఇందుకు గ్రామస్థాయిలో పంచాయతీ రాజ్ శాఖ సహకరించాలి. ఈ ప్రక్రియను పశుసంవర్ధక శాఖ పర్యవేక్షించాల్సి ఉంది. కానీ ఈ శాఖల మధ్య సమన్వయ లోపం మూగజీవాలకు శాపంగా మారింది.

పంచాయతీలదే బాధ్యత..

మండలంలో 14 గ్రామపంచాయతీల పరిధిలో 30కి పైగా ఆదివాసీ, గిరిజన గ్రామాలు ఉన్నాయి. వాటిలో 20కి పైగా నీటితొట్టీలను పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించారు. కొన్నింటిని నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో నీటితొట్టీపై రూ.30 వేలు ఖర్చు చేశారు. పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకే అప్పగించింది. కానీ అధికారుల పర్యవేక్షణ లేక వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో అవి అపరిశుభ్రంగా నిరుపయోగంగా మారాయి. నీటి తొట్టీల్లో నీరు లేక మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు మురికి కాలువల్లోని నీరు తాగుతున్నాయి. దీంతో అవి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

శిథిలావస్థలో నీటి తొట్టీలు..

మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టీలు శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లింగాపూర్, వంకామద్ది, మోతిపటార్, జాముల్‌ధరా, పట్కల్‌మంగితో పాటు ఇతర గ్రామాల్లోని నిర్మించిన నీటి తొట్టీలు నిరుపయోగంగా మారడంతో మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి. రైతులు కూడా తమ పశువులను అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మండలంలో ఆవులు 10381, గేదేలు 704, మేకలు 8,600 ఉన్నాయి.

తొట్టీల్లో నీటిని నింపాలి



మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో నిర్మించిన పశువుల తొట్టీల్లో నీటిని నింపడం లేదు. దీంతో దాహార్తి తీర్చుకోలేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్టీలు శిథిలావస్థలో ఉండడంతో నిరుపయోగంగా మారాయి. నీటి తొట్టీలల్లో అధికారులు నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలి.

– సురేశ్, పూల్‌సింగ్‌తండా, రైతు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు నాలుగు ప్రాంతాల్లో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 100 కేవీఏకు పెంచినట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేషారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెటర్నరీ ఆస్పత్రి ఏరియాలో రెండు, టీఆర్‌నగర్, అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ఒక్కొక్కటి మంగళవారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ వీరేశం, ఏడీఈ ఫిరోజ్ ఖాన్, ఏఈ లక్ష్మీరాజం, సిబ్బంది గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించడంపై హర్షం

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, బిల్లుకు మద్దతు పలికిన రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చట్టం అమలు కావడం బీసీలు సాధించిన విజయమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం, బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కన్న, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడె మారుతిపటేల్, సభ్యులు విశ్వనాథ్, కమలాకర్, బాలు, సత్యనారాయణ, శ్యాంరావ్, నామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు మంగళవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ట్రైసైకిళ్లు, పెన్నులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు మైలారపు మురళీధర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధాబాయి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు రాచకొండ నాగేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్, సంతోష్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు కౌటాల పోలీస్ స్టేషన్ వేదికగా జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు గ్రామం ఒక్కో టీంను ఎంపిక చేసుకుని, ఈ నెల 22 లోగా 84669 43511 నంబర్(కౌటాల పోలీస్ స్టేషన్)కు కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలుగా నిలిచే మూడు జట్లకు ప్రైజ్‌మనీ, ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు.

రోజువారీ కూలి చెల్లించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ కూలీలకు రోజువారి కూలి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆరెగూడ, మోసం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పని ప్రదేశాలను సందర్శించారు. నాయకులు అంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపిక



ప్రేమ్‌కుమార్

కౌటాల: టీజీపీఎస్సీ సోమవారం రాత్రి విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్ ఫలితాల్లో మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన జలంపెల్లి లింగమూర్తి –లలిత దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్ సత్తా చాటాడు. హాస్టల్ వెల్ఫేర్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ప్రేమ్‌కుమార్ గ్రూప్–4లో వార్డ్ అధికారిగా ఉద్యోగం సాధించారు. ప్రేమ్‌కుమార్ హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో కుటుంబసభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.

ఉత్తమ మార్కులు సాధించాలి



విద్యార్థులతో ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం 400 మందికి ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. ఒత్తిడిని అధిగమించి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎంఈవో సుభాష్, హెచ్‌ఎం సుభాష్ పాల్గొన్నారు.